క్లుప్తంగా

జాబ్‌కార్డు ఉన్నవారికే ఉపాధి



ఆమదాలవలసలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రేగిడి: జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే ఉపాధి పనులకు హాజరుకావాలని ఎంపీడీఓ జి.కాశీ విశ్వనాథరావు అన్నారు. మండలంలోని ఆమదాలవలస, వెంకంపేట, కొత్తచెలికానివలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. జాబ్‌కార్డు లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, అధికారులు వాటిని పరిశీలించి 24 గంటల్లో జాబ్‌కార్డు మంజూరు చేస్తారన్నారు. రెండు పూటలా పనులకు హాజరై, ఇచ్చిన కొలతలు పూర్తిచేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. ఆయనతోపాటు టెక్నికల్ అసిస్టెంట్ భారతి ఉన్నారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధంకండి

● గృహనిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మీనాక్షి


తెర్లాం: గృహనిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని గృహనిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని వెలగవలసలోని జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులకు సిమెంట్, ఇసుక, నిర్మాణ సామగ్రిని రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. బిల్లులు కూడా త్వరితగతిన చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ మీనాక్షి, తదితరులున్నారు.

రేపటి నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా

రాజాం సిటీ: ఈ నెల 17 నుంచి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో నీటి సరఫరాను రోజు విడిచి రోజు చేయనున్నామని కమిషనర్ డీటీవీ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేగిడి ఆమదాలవలస మండలం సంకిలి వద్ద హెడ్‌రెగ్యులేటర్ మోటార్ మరమ్మతులకు గురైన కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు చెప్పారు. మరమ్మతులు పూర్తయ్యేవరకు రోజు విడిచి రోజు నీటి సరఫరా ఉంటుందన్నారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

● జాబ్స్ జిల్లా మేనేజర్ మార్టిన్ లూథర్



శిక్షణను పరిశీలిస్తున్న జాబ్స్ జిల్లా మేనేజర్ డి.మార్టిన్ లూథర్

బొబ్బిలి రూరల్: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సీడాప్ ద్వారా కంప్యూటర్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్‌స్కిల్స్, సీఆర్ఎం కోర్సులలో శిక్షణ పొందినవారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జాబ్స్ జిల్లా మేనేజర్ డి.మార్టిన్ లూథర్ అన్నారు. మండలంలోని కోమటపల్లి తాండ్రపాపారాయ ఇంజినీరింగ్ కళాశాలలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల శిక్షణ, వారికి అందిస్తున్న భోజనం, మౌలికవసతులపై ఆరా తీశారు. శిక్షణ పొందుతున్న 140 మంది విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పదో తరగతి నుంచి వివిధ విద్యార్హతలున్న వారికి కంప్యూటర్స్, సాఫ్ట్‌స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సీఆర్ఎం కోర్సులలో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. మరో 70 మందికి శిక్షణ ఇస్తామని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా అభ్యర్థులు ఈ నెల 18లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో 9701200676, 7095702728 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఆయన వెంట వెలుగు ఏపీఎం పీఏ స్వామి ఉన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లోనూ రాణించాలి

రామభద్రపురం: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి అన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైన కొట్టక్కి ఉన్నత పాఠశాల విద్యార్థులు ముత్యాల వినీత, సామిరెడ్డి రామలక్ష్మి, అప్పికొండ శరత్‌నాయుడు, మరిసి లావణ్య, కారంగి విమలను అభినందించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 21 వరకు చైన్నైలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు వీరంతా బయలుదేరారు. కార్యక్రమంలో హెచ్ఎం రావాడ భాస్కరరావు, జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి బొత్స రత్నకిశోర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

బొబ్బిలి రూరల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ అష్టాదశ వార్షికోత్సవం రెండో రోజైన బుధవారం కూడా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అర్చకుడు వేమకోటి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మహాకుంభాబిషేకం చేపట్టారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో పాలూరి శంకరరావు, పిరిడి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి నుంచే వైఎస్సార్‌సీపీ గెలుపు ప్రారంభం

రామభద్రపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలలో బొబ్బిలి నుంచే వైఎస్సార్‌సీపీ గెలుపు ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు జోస్యం చెప్పారు. మండలంలోని మిర్తివలసలో బుధవారం జరిగిన ఓ వివాహానికి ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ, ఈ మూడున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి గతంలో టీడీపీ హయాంలో ఎక్కడా జరగలేదన్నారు. అప్పట్లో టీడీపీకి ఓట్లేసిన ప్రజలు పూర్తిగా మోసపోయారన్నారు. మూడున్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలో టీడీపీ తరఫున ఎవరు పోటీ చేస్తారో తెలియదని ఎద్దేవా చేశారు. ఆయన వెంట ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూ ఎస్ రాయులు, మండల బూత్ కమిటీ కన్వీనర్ పత్తిగుళ్ల ఏక్‌నాథ్, నాయకులు డర్రు పైడిరాజు, చొక్కాపు తవిటినాయుడు, కనిమెరక అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మహాకుంబాబిషేకం పూజలో పాల్గొన్న భక్తులు

సీఎం సహాయ నిధి గొప్ప వరం

బొబ్బిలి: ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి గొప్ప వరమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుల్లెల శ్రీనివాసరావుకు 1.40 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను పంపిణీ చేశారు. శ్రీనివాసరావుకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక అన్నివర్గాలనూ ఆదుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, న్యాయవాది రుంకాన ప్రసాద్ పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ

వంగర: మండలంలోని శివ్వాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏనుగుతల వేమినాయుడును ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో బుధవారం ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకుని పార్టీకి సేవలందించాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు తదితరులున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు పలువురి పరామర్శ

రాజాం: మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావుకు ఇటీవల కంటి ఆపరేషన్ జరగడంతో పలువురు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పరామర్శించిన వారిలో పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావుతో పాటు పలువురు కార్యకర్తలు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, తహసీల్దార్ విజయభాస్కర్ ఉన్నారు.



వంగర: వేమినాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రైతులు ఆందోళన చెందొద్దు

రేగిడి: రైతుల వద్ద ఇంకా మిగిలి ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. బుధవారం రేగిడిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. అపరాలు పంట ఉన్న సందర్భంగా ఇంకా నూర్పిడి చేయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. సమస్యను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తున్నారని, ఏ ప్రభుత్వం కూడా రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని ఇంత మొత్తంలో కొనుగోలు చేయలేదన్నారు. రైతులు త్వరగా నూర్పులు పూర్తిచేసి అమ్మకానికి ధాన్యాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. వారితోపాటు వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, కరణం సుదర్శనరావు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

పాఠశాల తనిఖీ

వంగర: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. జగన్నాథవలస ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. జగనన్న గోరుముద్ద వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం సత్యవతి ఉన్నారు.

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, ఆమదాలవలస కాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలును ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం బి.విజయమ్మ ఉన్నారు.



రేగిడి: ఆమదాలవలస కాలనీ పాఠశాలలో గోరుముద్ద వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ

19న రారవే వార్షికోత్సవం

రాజాం: రాజాం రచయితల వేదిక వార్షికోత్సవ సమావేశం ఈనెల 19న రాజాం విద్యానికేతన్ స్కూల్ ఆవరణంలో నిర్వహించనున్నట్లు వేదిక కన్వీనర్ గార రంగనాథం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సాహితీ రత్నాకర్ దామెర వెంకటసూర్యారావు చేతులమీదుగా 'విస్మృత కళింగాంధ్ర' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. బుధవారం ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రాజగోపాలనాయుడులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులను కలిసి ఆహ్వానాలు అందించారు.

వాహనాల వేలం రేపు

రామభద్రపురం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను ఎస్పీ దీపికాపాటిల్ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం వేలం వేయనున్నట్లు ఎస్సై సురేంద్రనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో వేలం వేయనున్నామని, ఆసక్తి గలవారు నేరుగా వేలంలో పాల్గొనాలని కోరారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

రాజాం: పట్టణంలో యూటీఎఫ్ సంఘం బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించింది. కొత్తవలస, దోలపేట, పొనుగుటివలస తదితర పాఠశాలలో ఆ సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రెడ్డి మోహనరావుతో పాటు జిల్లా కార్యదర్శి బాలమురళీకృష్ణ, పి.వాసు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి తదితరులు పాఠశాలలకు వెళ్లి సభ్యత్వాలు నమోదు చేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

సంతకవిటి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ సులోచనరాణి, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఎస్సై జనార్దనరావు బుధవారం పరిశీలించారు. కేంద్రంలో అందుబాటులో ఉన్న వసతులపై ఆరా తీశారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 1121 మంది గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వాటన్నింటినీ మరోసారి పునఃపరిశీలించి తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలోని ఓటర్లంతా ఇదే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక రాజా కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎస్.రాజారావు, ఎన్నికల డీటీ ఆర్.సాయికృష్ణ పరిశీలించారు. తొలుత నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా.. ఓటర్లు పెరగడంతో మరో రెండు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

తెర్లాం: మార్చి 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తెర్లాం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ జోల రాజేశ్వరరావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం, దాని చుట్టు పక్కల ఉన్న ప్రదేశాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రానికి సంబంధించిన విషయాలను పాఠశాల హెచ్ఎం పాపారావును అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రానికి కావల్సిన మౌలిక సదుపాయలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. వారితోపాటు ఇన్‌చార్జ్ ఆర్ఐ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.



జెడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనల మేరకు పనులు

బొబ్బిలి రూరల్: ఉపాధి వేతనదారులకు నిబంధనల మేరకు పనులు కల్పించాలని సీఎల్ఆర్‌సీ కోర్స్ డైరెక్టర్ చిన్నంనాయుడు ఉపాధి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏపీఓ జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎన్నికల డీటీగా సాయికృష్ణ

బొబ్బిలి రూరల్: ఎన్నికల డీటీ నాగేశ్వరరావు మెడికల్ లీవ్ పెట్టడంతో సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణను ఇన్‌చార్జ్ ఎన్నికల డీటీగా నియమించినట్లు తహసీల్దార్ ఎస్.రాజారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యల్లేని భూ రికార్డులే లక్ష్యం

● ఆర్డీఓ శేషశైలజ

రామభద్రపురం: సమస్యలు లేని భూ రికార్డులు రైతులకు అందజేయడమే ప్రభుత్వం లక్ష్యమని ఆర్డీఓ శేషశైలజ అన్నారు. మండలంలోని కోటశిర్లాం రెవెన్యూ పరిధిలో చేపడుతున్న సమగ్ర భూ సర్వేను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భూ సర్వే ఎలా జరుగుతుందీ, ఏయే గ్రామాల్లో పూర్తయిందీ, సర్వే వివరాలు ఎంతవరకు అప్‌లోడ్ చేశారు.. అన్న వివరాలను తహసీల్దార్ సుబ్బారావును అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే చేయాలని సూచించారు. అలాగే గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న ఇతర శాఖలకు సంబంధించిన వారి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, సమగ్ర భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాలకు చెందిన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, ఆ పాస్ పుస్తకాలలో పొరబాటున భూ విస్తీర్ణం, సర్వే నంబర్లు తప్పుగా పడితే వెంటనే సరిచేస్తామని తెలిపారు.



రామభద్రపురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

పక్కాగా విధులు

● పాఠశాలల లైజనింగ్ అధికారి రాజ్‌కుమార్

బొబ్బిలి రూరల్: పాఠశాలల సిబ్బంది ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కాగా విధులు నిర్వహించాలని పాఠశాలల లైజనింగ్ అధికారి ఎస్.రాజ్‌కుమార్ అన్నారు. ఇటీవల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ సందర్శించిన పిరిడి, కలువరాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిరిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఆర్వో ప్లాంట్, మధ్యాహ్న భోజనం, సిబ్బంది పనితీరు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. గతంలో ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంపై ఫిర్యాదు రావడంతో నాడు-నేడు ఏఈ, డీఈఈ, ఈఈ, హెచ్ఎంలకు ప్రవీణ్‌ప్రకాష్ చార్జ్‌మెమోలు ఇచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పాఠశాలను పరిశీలించిన లైజనింగ్ అధికారి రాజ్‌కుమార్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వెలుగు ఏపీఎం పీఏ స్వామి, ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.



కలువరాయి పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న లైజనింగ్ అధికారి రాజ్‌కుమార్

సంక్షిప్తంగా...

మధ్యాహ్న భోజనం పరిశీలన

బొబ్బిలి రూరల్: మండలంలోని కమ్మవలస ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ పిల్లా వసుంధర బుధవారం పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

జాతరకు పటిష్ట బందోబస్తు

వంగర: సంగాంలో వెలసిన సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటు, త్రివేణి సంగమం వద్ద స్నానపు ఘాట్లు, జాతర స్థలాన్ని పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వంగర: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఈఓపీఆర్డీ లోపింటి త్రినాథ్ అన్నారు. మండలంలోని సంగాం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రికార్డుల నిర్వహణ, ఉద్యోగులు హాజరు, స్పందన వినతుల పరిష్కారం, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. సచివాలయం కార్యదర్శి బిందుశేఖర్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

రాజాం సిటీ: గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. మండలంలోని పెనుబాక సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేసేందుకే గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ బండి బోడెమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



అధికారులకు సమస్యలను వివరిస్తున్న వినియోగదారులు

రాజాం సిటీ: విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి వినియోగదారుల అవగాహనా సదస్సులు దోహదపడతాయని సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయవాది బి.సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో వినియోగదారుల సమస్యలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు సంబంధిత అధికారులకు కానీ, కార్యాలయంలో కానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. వాటిని పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు జీఎంఆర్ ఐటీలో ఎలక్ట్రానిక్స్ విద్యార్థులతో సమన్వయ సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈఈ టీజీకే మూర్తి, ఏడీ ఫణీంద్రకుమార్, ఏఈలు కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

తెర్లాం: మండలంలోని వెలగవలస, రంగప్పవలస గ్రామాలకు సంబంధించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఉపాధి ఏపీఓ జగదీశ్వరరావు అన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణ పనులు పూర్తికావడంతో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన చెత్తను కేంద్రాన్ని తీసుకువచ్చి సంపదగా మార్చాలని కార్యదర్శి ఇందిరను ఆదేశించారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి

రాజాం సిటీ: పట్టణంతోపాటు మండల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ పి.విజయభాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర కూడా ఎన్నికల నియమావళి అనుసరించి జరపాలని సూచించారు. ఎన్నికల కోడ్‌కు ఎటువంటి విఘాతం కలిగించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, సీఐ కె.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండచిలువ హతం

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కిలో ఎనిమిది అడుగుల కొండచిలువను బుధవారం హతమార్చారు. రైతులు పొలం పని చేస్తుండగా కొండచిలువ కనిపించడంతో భయపడి పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వచ్చి కొండచిలువను హతమార్చారు.

చెరుకు పంటకోతలో రైతులు బిజీ

రేగిడి: సంకిలి వద్ద ఉన్న చెరుకు కర్మాగారం ఉండడంతో ఈ ప్రాంతం రైతులు చెరుకు పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం పంటకోత దశకు చేరుకోవడంతో చెరుకు నరికే పనిలో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు. కోసిన పంటను ట్రాక్టర్లు, లారీల్లో ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. పంటకోసిన తర్వాత మమ్ము తోటకు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. బోదులకు ఇరువైపులా మట్టిని వేసుకుంటే పిలకలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందన్నారు. వన్నలి, అంబకండి, ఉంగరాడ, కొమిర, ఖండ్యాం, వెంకటాపురం, సంకిలి, రేగిడి గ్రామాల్లో చెరకు మమ్ము తోటలకు పార గొప్పులు తవ్విస్తున్నారు.

నవధాన్యాలతో ఆరోగ్యం

రాజాం: ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలంటే నవధాన్యాలు తీసుకోవాలని, వాటిని ఇంటి పెరడులో కూడా సాగుచేయవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ డి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలో గార్రాజుచీపురుపల్లి గ్రామంలో బుధవారం నవధాన్యాల సాగు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ పాఠశాల విద్యార్థులు, రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగుతో భూసారం పెరుగతుందని, జీవ వైవిధ్యం మెరుగుపడుతుందని అన్నారు. భూగర్భ కార్బన్, భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు, ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు పొందవచ్చని వివరించారు. అనంతరం మావనహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లు నారాయణమ్మ, రేఖ, ఐసీఆర్‌పీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు మేలు

తెర్లాం: ఖరీఫ్ సీజన్‌లో వేసే వరి పంటకు ముందు పొలాల్లో నవధాన్యాలు సాగు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. పూనువలస క్లస్టర్‌లో కొత్తగా చేర్చిన నందిగాంలో రైతులు, ఉపాధి వేతనదారులకు నవధాన్యాల సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాల సాగుతో పాటు 18 నుంచి 30 రకాల విత్తనాలు చల్లుకోవచ్చని తెలిపారు. వరిపంట సాగుకు ముందు చేపట్టే దమ్ములో ఈ పంటలను దున్నేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు.



మానవహారంగా ఏర్పడిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

చురుగ్గా సోమిదవలస రోడ్డు పనులు

తెర్లాం: మండలంలోని పణుకువలస పంచాయతీ సోమిదవలస గ్రామానికి వేస్తున్న తారురోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. డి.గదబవలస జంక్షన్ నుంచి సోమిదవలస వరకు ఉన్న మెటల్ రోడ్డును ప్రభుత్వం తారురోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో తారురోడ్డు పనులు కొన్ని రోజులుగా జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే మండల వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి చేపేన సత్యనారాయణ, పణుకువలస, రంగప్పవలస సర్పంచ్‌లు చందక సత్యనారాయణ, శనపతి రాంబాబు రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

తెర్లాం: ఉపాధి పని ప్రదేశంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వేతనదారులంతా సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ కోరారు. మండలంలోని గోపాలవలస కంసాలిబందలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద సర్పంచ్ గొందాల కుమారి, మామిడి రైతుల ఉత్పత్తిదార్ల సంఘం మండల అధ్యక్షుడు జి.వెంకటరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ జగదీశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగభూషణనాయుడు, ఉపాధి క్షేత్ర సహాయకురాలు మాధవీకుమారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు.

E.A.32/2022 IN O.E.P.1/2019, O.S.159/2015

పిటిషన్ :
గొడే అరవింద్ కుమార్ ... పిటీషనర్ / డి.హెచ్.ఆర్
ఎండ్ :
అట్లూరి శ్రీనివాసరావు @ శ్రీనివాస్ (died) ... రెస్పాండెంట్సు / జె.డి.ఆర్
To,

R3 అట్లూరి జ్యోతిక తండ్రి లేటు శ్రీనివాసరావు @ శ్రీనివాస్ వయస్సు 14 సం॥లు, కేరాఫ్ బాలాజీమెస్, ఓపెపి : టి.పి.ఇంజనీరింగ్ కాలేజి, కోమటిపల్లి గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా.

R4 అట్లూరి లక్ష్మీనారాయణ చౌదరి @ చక్రి తండ్రి లేటు శ్రీనివాసరావు @ శ్రీనివాస్, వయస్సు 10సం॥లు, రెస్పడూ (యిందలి 3,4 రెస్పాండెంట్సు మైనర్సు అయినందున 2వ రెస్పాండెంటు మరియు తల్లి నేచురల్ గార్డియన్ అయి వున్నది).

R2 అట్లూరి రాజ్యలక్ష్మి @ శైలజ భర్త లేటు శ్రీనివాసరావు @ శ్రీనివాస్ వయస్సు 34 సం॥లు, కేరాఫ్ బాలాజీమెస్, ఓపెపి : టి.పి.ఇంజనీరింగ్ కాలేజి, కోమటిపల్లి గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా.

యిందలి 3,4 రెస్పాండెంట్సు మైనర్సు అయినందున తల్లి అయిన మీరు వారికి నేచురల్ గార్డియన్ అయినందున, యిందలి అమలు నోటీసులు మీకు అనేక పర్యాయములు పంపించినను, మీరు బుద్ధి పూర్వకంగా తీసుకొనియుండలేదు, యిందలి 3,4 రెస్పాండెంట్లు తండ్రి గారున్నూ మీకు భర్త అయిన లేటు అట్లూరి శ్రీనివాసరావుకు మీరు వారసులు అయినందున యిందలి 3,4 రెస్పాండెంట్లు తరుపున నేచురల్ గార్డియన్‌గా మీకు తేది.01-03-2023న ఉదయం 10.30 గం॥లుకు పై కోర్టులో మీరు స్వయముగా గాని ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క వాదన వినిపించుకొనవలెను. లేని యెడల వారి తరుపున కోర్టు గార్డియన్ నియమించి మీకు పరోక్షంగా తీర్మానం చేయుదురు.

(యీ ప్రకటన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ప్రచురించబడినది)

ఇట్లు,
గంటి గోపాల కృష్ణశర్మ,
పిటిషనరు తరపు న్యాయవాది,
బొబ్బిలి, సెల్ నెం. 9440192234.

బొబ్బిలి
తేది.14-02-2023